

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 07-01-2026 | సంపుటి - 26 | సంచిక -231 | రూ : 4 | పేజీలు: 8


నేపాల్ సరిహద్దుల్లో ఉద్రిక్తత..

## భారత్ అప్రమత్తం

- నేపాల్ లో మత ఘర్షణలు
- ఒక ప్రార్థనా స్థలంపై కొందరి దాడి
- పలు ప్రాంతాల్లో ఆందోళనకారుల నిరసన
- అప్రమత్తమైన భారత ప్రభుత్వం
- నేపాల్ సరిహద్దులు మూసివేత

2లో





2లో

ఇక్కడే ఉంటా.. దమ్ముంటే

## వచ్చి నన్ను పట్టుకో..

- కొలంబియాపై దృష్టి సారించిన ట్రంప్.. పెట్రోకు తీవ్ర హెచ్చరిక
- నన్ను వచ్చి పట్టుకో.. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా అంటూ పెట్రో బహిరంగ సవాల్
- వెనిజువెలా అధ్యక్షుడు మదురో అరెస్ట్ తర్వాత వేడెక్కిన రాజకీయం

మరోసారి ఆసుపత్రిలో

## అడ్మిట్ అయిన సోనియాగాంధీ

- దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న సోనియా
- సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరిక
- సోనియా ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు

2లో



కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు

## భారీగా తరలివచ్చిన అభిమానులు

2లో



- బాల్కనీలో నిలబడి అందరికీ అభివాదం చేసిన కవిత
- కిందకు వచ్చి అందరినీ పలకరించిన వైనం
- మీరే నా బలం అంటూ కవిత భావోద్వేగం

ఆ కిక్ కోసమే మనమందరం

## కలిసికట్టుగా పనిచేయాలి: సీఎం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో ఎస్ఐపీబీ సమావేశం
- గత ప్రభుత్వంలో పోయిన బ్రాండ్ ఇమేజ్ ఇప్పుడు తిరిగి వచ్చిందన్న చంద్రబాబు
- టాటా, అదానీ, రిలయెన్స్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని వెల్లడి
- రూ.4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించిందని వివరణ
- 2026లోనూ ఇదే ఉత్సాహంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం

2లో



కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్..

## ఇంకా అదుపులోకి రాని మంటలు



- కోనసీమ జిల్లా ఇరుసుమండలో ఓఎన్జీసీ బావి బ్లోఅవుట్
- రెండో రోజూ అదుపులోకి రాని మంటలు
- భద్రతా చర్యల్లో భాగంగా 500 కుటుంబాల తరలింపు
- సీఎం, డిప్యూటీ సీఎం పరిస్థితిని సమీక్షిస్తున్నారని తెలిపిన ఎంపీ

2లో



2లో

యూపీలో వివిధ కారణాల వల్ల

## 2.8 కోట్ల ఓట్లు రద్దు

- 15.44 కోట్ల నుంచి ఎస్ఐఆర్ తర్వాత 12.56 కోట్లకు తగ్గిన ఓటర్లు
- శాశ్వత వలస, మరణాలు, ఒకటి కంటే ఎక్కువ చోట రిజిస్ట్రేషన్ల ఓటర్ల తొలగింత
- అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించవచ్చన్న అధికారులు

# బంగ్లాదేశ్ లో ఒకేరోజు మూడు ఘోరాలు.. హిందువులపై ఆగని అకృత్యాలు

బంగ్లాదేశ్: బంగ్లాదేశ్ లో హిందువులపై హింసకు అంతులేకుండా పోయింది. సోమవారం ఒక్కరోజే మూడు దారుణాలు చోటుచేసుకున్నాయి. ఉదయం ఓ వితంతువుపై గ్యాంగ్ రేప్ జరగగా, సాయంత్రం ఓ జర్నలిస్టును దుండగులు కాల్చి చంపారు. రాత్రి ఓ వ్యాపారిపై కత్తులతో దాడి చేసి దారుణంగా హతమార్చారు. ఈ వరుస దారుణాలతో అక్కడి హిందువులు తీవ్ర భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. నార్సింగ్ది జిల్లా కేంద్రంలోని బ్రాహ్మండికి చెందిన శరత్ చక్రవర్తి మణి స్థానికంగా ఓ కిరాణా షాపు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. మణి గతంలో దక్షిణ కొరియాకు వెళ్లి కొంతకాలం పనిచేసి వచ్చాడు. అక్కడ సంపాదించుకుని వచ్చిన సొమ్ముతో బ్రాహ్మండిలో ఓ ఇల్లు కట్టుకున్నాడు. ప్రస్తుతం కిరాణా షాపుతో వచ్చే ఆదాయంతో కుటుంబం గడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో కొంతమంది దుండగులు మణి షాపు వద్దకు వచ్చారు. వచ్చీరావడంతోనే కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో మణి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆపై దుండగులు పారిపోగా.. స్థానికులు మణిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మణిని పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మరణించాడని ప్రకటించారు. ఈ దారుణానికి ముందు సోమవారం ఉదయం కాళీగంజ్ లో 40 ఏళ్ల హిందూ వితంతువుపై దారుణం చోటుచేసుకుంది. ఇద్దరు యువకులు ఆమెపై సామూహిక అత్యాచారం జరిపారు. చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించారు. మరో ఘటనలో.. సాయంత్రం జశోర్ జిల్లా కాపాలియా బజార్ లో స్థానిక దినపత్రికకు ఎడిటర్ గా వ్యవహరిస్తున్న జర్నలిస్ట్ రాణా ప్రతాప్ అనే యువకుడిని దుండగులు హత్య చేశారు. కాపాలియా బజార్ లో ఓ ఐస్ ఫ్యాక్టరీని కూడా నిర్వహిస్తున్న రాణా ప్రతాప్ ను అతడి ఫ్యాక్టరీ దగ్గరే దారుణంగా కాల్చి చంపారు. సోమవారం ఒక్కరోజే మూడు దారుణాలు చోటుచేసుకున్నాయి.

## నేపాల్ సరిహద్దుల్లో ఉద్రిక్తత...
## భారత్ అప్రమత్తం

నేపాల్: హిమాలయ దేశం నేపాల్‌లో మతపరమైన ఘర్షణలు చెలరేగాయి. ధనుశా జిల్లాలో ఒక ప్రార్థనా స్థలంపై కొందరు దాడికి పాల్పడి, ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆందోళనలు చెలరేగాయి. రాహౌల్, పర్సా ప్రాంతాల్లో ఆందోళకారులు నిరసనలకు దిగారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పెద్ద సంఖ్యలో భద్రతాదళాలు రంగంలోకి దిగాయి. కొన్ని చోట్ల పరిస్థితి హింసాత్మకంగా మారడంతో స్థానిక యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో భారత ప్రభుత్వం అలర్ట్ అయింది. నేపాల్ తో సరిహద్దును మూసేసింది. ఎమర్జెన్సీ సేవలు మినహా, రాకపోకలను బంద్ చేసింది.

## కవితకు మద్దతుగా ఆమె ఇంటి వద్దకు
## భారీగా తరలివచ్చిన అభిమానులు

హైదరాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటి వద్దకు భారీ సంఖ్యలో ఆమె అభిమానులు చేరుకున్నారు. 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చబోతున్నామని ఆమె ప్రకటించిన వెంటనే, రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నేతలు, ఉద్యమ కార్యకర్తలు భారీగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్దకు తరలివచ్చారు. ఈ సందర్భంగా కవిత తన ఇంటి బాల్కనీలో నిలబడి అందరికీ చేతులు జోడించి అభివాదం చేశారు. తర్వాత కిందకు వచ్చి ప్రతి ఒక్కరినీ పలకరించారు. "ఎలా ఉన్నారు? ఇంట్లో అందరూ బాగున్నారా?" అంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ కాలం నుంచి తన వెన్నంటి ఉండి, ఇప్పుడు కష్టకాలంలో కూడా మద్దతుగా నిలిచిన ఉద్యమకారులను చూసి కవిత భావోద్వేగానికి లోనయ్యారు. కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆమె గొంతు కంపిస్తూ "మీరు లేకపోతే నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు. మీరు నా బలం" అంటూ మాట్లాడారు. ఈ సందర్భంలో అక్కడి పరిసర ప్రాంతాలు నినాదాలతో మారుమోగాయి. "జై తెలంగాణ... కవితక్క నాయకత్వం వర్ధిల్లాలి... తెలంగాణ జాగృతి జిందాబాద్" అంటూ నినాదాలు చేశారు. "ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కవితకు అండగా ఉంటాం. తెలంగాణ జాగృతి ద్వారా ప్రజల కోసం పనిచేస్తాం" అని నినదించారు. మరోవైపు, రాజకీయ శక్తిగా అవతరించబోతున్నామంటూ కవిత చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమయింది. కవిత రాజకీయ పార్టీని ప్రకటిస్తే... రాష్ట్ర రాజకీయ సమీకరణలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మరోసారి ఆసుపత్రిలో
## అడ్మిట్ అయిన సోనియాగాంధీ

ఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు, రాజ్యసభ ఎంపీ సోనియా గాంధీ మరోసారి అనారోగ్యానికి గురయ్యారు. తీవ్రమైన దగ్గు, శ్వాసకోశ సమస్యలతో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆసుపత్రి వర్గాలు స్పష్టం చేశాయి. సీనియర్ పల్మోనాలజిస్ట్ (ఊపిరితిత్తుల నిపుణుడు) నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు చికిత్స అందిస్తోంది. ఢిల్లీలో గత కొన్ని రోజులుగా వాయు కాలుష్యం చాలా ఘోరంగా ఉంది. దీని కారణంగానే ఆమె అనారోగ్యానికి గురైనట్టు వైద్యులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గతంలో కూడా ఆమె శ్వాసకోశ సమస్యలతో బాధపడ్డారు. గత డిసెంబర్ లో సోనియా 79వ పుట్టినరోజును జరుపుకున్నారు. మరోవైపు, సోనియా ఆసుపత్రిలో చేరారన్న వార్తతో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు గురవుతున్నాయి. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంకోవైపు, సోనియా ఆరోగ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

## సోషల్ మీడియాలో రెచ్చిపోతే ఇక కఠిన చర్యలే
## : మంత్రి నారా లోకేశ్

సోషల్ మీడియా వేదికగా కుట్రపూరితంగా విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం మోపుతామని, అటువంటి వారిపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలపై వచ్చే సద్విమర్శలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని, అయితే వాక్ స్వాతంత్ర్యం (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) పేరుతో వ్యవస్థీకృతంగా చేసే దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో 'సోషల్ మీడియా జవాబుదారీతనం, పౌరుల రక్షణ' అనే అంశంపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... "వ్యక్తిత్వ హననానికి పాల్పడటం, మహిళలను కించపరిచేలా అసభ్యకర పోస్టులు పెట్టడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ కంటెంట్‌ను అరికట్టాలి. మహిళలపై అవమానకరమైన పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. ప్రజాభిప్రాయాన్ని అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. కానీ, కొందరు విదేశాల్లో ఉంటూ ఇక్కడి సామాజిక సామరస్యానికి భంగం కలిగించేలా పోస్టులు పెడుతున్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా బలమైన చట్టపరమైన వ్యవస్థను (లీగల్ ఫ్రేమ్‌వర్క్) రూపొందించాలి" అని అధికారులను ఆదేశించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి భార్యపై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడైనా జైలుకు పంపించామని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తుచేశారు. సోషల్ మీడియా నియంత్రణ కోసం ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేయాలని లోకేశ్ సూచించారు. ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్, యూకే వంటి దేశాల్లో స్వతంత్ర నియంత్రణ సంస్థలు పనిచేస్తూ భారీ జరిమానాలు విధిస్తున్నాయని ఆయన ప్రస్తావించారు. గతంలో న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకుని కూడా అసభ్య పోస్టులు పెట్టారని, ఇలాంటి ధోరణులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో పాల్గొన్న హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. సైబర్ నేరాలకు సంబంధించి కేసుల నమోదు, చార్జిషీటు దాఖలులో జాప్యం జరుగుతోందని, ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. నెల రోజుల్లోగా చార్జిషీటు దాఖలు చేసేలా చర్యలు తీసుకోవాలని, విద్వేషపూరిత పోస్టులు పెట్టే వారి సోషల్ మీడియా ఖాతాలను తక్షణమే సస్పెండ్ చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రిటైర్డ్ న్యాయమూర్తులు, న్యాయ నిపుణుల సలహాలు తీసుకుని పటిష్టమైన చట్టాన్ని రూపొందిస్తామని, రాష్ట్రస్థాయిలో సమన్వయ సెల్స్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు హోం, న్యాయ, ఐటీ, సమాచార శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కోనసీమలో ఓఎన్జీసీ గ్యాస్ బ్లోఅవుట్...
# ఇంకా అదుపులోకి రాని మంటలు

కోనసీమ: కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావిలో చెలరేగిన మంటలు రెండో రోజు కూడా అదుపులోకి రాలేదు. సోమవారం మధ్యాహ్నం మోరి 5 బావిలో రిపేర్ పనులు చేస్తుండగా అధిక పీడనంతో గ్యాస్, ముడి చమురు బయటకు చిమ్మి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనతో సమీప గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఓఎన్జీసీ సాంకేతిక నిపుణులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అంతర్జాతీయ నిపుణుల సహాయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రమాద స్థలాన్ని పూర్తిగా ఆధీనంలోకి తీసుకుని, బావిని చల్లబరిచే పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతానికి నీరు, మట్టితో మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నారు. అధికారులు రెండు లారీల్లో కూలెంట్ ను తీసుకువస్తున్నారు. దీని సాయంతో మంటలు ఆర్పడంలో పురోగతి కనిపిస్తుందని భావిస్తున్నారు. కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా ఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఇరుసుమండ, మోరి గ్రామాలకు చెందిన సుమారు 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన అమలాపురం ఎంపీ గంటి హరీశ్ బాలయోగి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

## ఆ కిక్ కోసమే మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి




అమరావతి: "సక్సెస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుంది. ఆ కిక్ కోసమే మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి. పాలనలో వేగాన్ని పెంచి, ప్రజలకు వేగంగా సుపరిపాలన ఫలాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2025లో సాధించిన విజయాల స్ఫూర్తితో 2026లోనూ అదే ఉత్సాహంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం నాడు సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) 14వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరి సమష్టి కృషితోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా దెబ్బతిన్న 'బ్రాండ్ ఏపీ'ని తిరిగి నిలబెట్టగలిగామని చంద్రబాబు అన్నారు. "2025లో రాష్ట్రం కోసం అందరూ అద్భుతంగా పనిచేశారు. మన టీమ్‌వర్క్ ఫలితంగానే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివచ్చాయి. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయెన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి" అని ఆయన వివరించారు. ఈ క్రమంలో ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వం సాధించిన విజయాలను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. "విద్యుత్ ఛార్జీలను 13 పైసలు తగ్గించాం. ప్రజలపై రూ.4,500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని మోపకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. 2029 నాటికి విద్యుత్ కొనుగోలు ధరను యూనిట్‌కు రూ.3.70కి తగ్గించడమే లక్ష్యం. విద్యుత్ రంగంలో మనం చేసిన కృషి వల్లే రాష్ట్రానికి డేటా సెంటర్లు వస్తున్నాయి" అని చంద్రబాబు పేర్కొన్నారు. దావోస్ పర్యటన ద్వారా ఏపీ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేయగలిగామని, విదేశీ కంపెనీలను ఆకర్షించడంలో విజయం సాధించామని తెలిపారు. గూగుల్ సెంటర్‌ను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్ ఎంతో కృషి చేశారంటూ అభినందించారు. కాగా, ఈ 14వ ఎస్ఐపీబీ సమావేశంలో పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో పలు కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. గత 13 సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులకు, 8.23 లక్షల ఉద్యోగాలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన విషయాన్ని అధికారులు గుర్తుచేశారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి, టీజీ భరత్... సీఎస్ విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇక్కడే ఉంటా.. దమ్ముంటే వచ్చి నన్ను పట్టుకో..

వాషింగ్టన్: వాషింగ్టన్, బొగొటా మధ్య ఉద్రిక్తతలు శరవేగంగా పెరుగుతున్నాయి. వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఇప్పుడు కొలంబియా వంతు వచ్చిందన్నట్లుగా పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యలకు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఏకంగా "నన్ను వచ్చి పట్టుకో. నేను ఇక్కడే ఎదురుచూస్తున్నా" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. గత వారాంతంలో మదురో అరెస్ట్‌ను ఓ పెద్ద విజయంగా అభివర్ణించిన ట్రంప్, ఇప్పుడు తన దృష్టిని కొలంబియా వైపు మళ్లించారు. కొలంబియా కూడా 'చాలా అనారోగ్యంతో' ఉందని, 'కొకైన్ తయారుచేసి అమెరికాకు అమ్మే ఓ అనారోగ్యకర వ్యక్తి' దేశాన్ని నడిపిస్తున్నారని పెట్రోను ఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. "అతనికి కొకైన్ మిల్లులు, ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఇదంతా ఎక్కువ కాలం సాగదు" అని ట్రంప్ హెచ్చరించారు. కొలంబియాలో కూడా అమెరికా ఆపరేషన్ ఉంటుందా? అని విలేకరులు అడగ్గా, "నాకు ఇది మంచి ఆలోచనలాగే ఉంది" అని బదులిచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలపై సోమవారం పెట్రో 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. మరోవైపు కొలంబియా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. చర్చలు, సహకారం, పరస్పర గౌరవం ఆధారంగా ఇతర దేశాలతో సంబంధాలు కోరుకుంటున్నట్లు తెలిపింది. యాక్సియోస్ (Axios) కథనం ప్రకారం ఈ పరిణామాలపై వైట్‌హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ స్పందించారు. ఈ ప్రాంతంలో అమెరికా పట్టు బిగించి, వలసలను, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టే భద్రతా ప్రణాళికలో ఈ చర్యలు భాగమేనని తెలిపారు. "ప్రతి ఏటా వేలాది మంది అమెరికన్ల మరణానికి కారణమవుతున్న మాదకద్రవ్యాల నుంచి మాతృభూమిని రక్షించుకోవడానికి అధ్యక్షుడి వద్ద అనేక మార్గాలున్నాయి" అని ఆమె పేర్కొన్నారు. గత అక్టోబర్‌లోనే డ్రగ్స్‌తో సంబంధాలున్నాయనే ఆరోపణలతో ట్రంప్... పెట్రో, ఆయన కుటుంబంపై ఆంక్షలు విధించారు. అయితే పెట్రో ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తన హయాంలో 'ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద కొకైన్ స్వాధీనం' జరిగిందని స్పష్టం చేస్తున్నారు. వెనిజువెలాలో జరిగిన ఆపరేషన్ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు కొలంబియాలో కూడా అలాంటి పరిస్థితి వస్తుందేమోనన్న ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

## యూపీలో వివిధ కారణాల వల్ల 2.8 కోట్ల ఓట్లు రద్దు



ఉత్తర ప్రదేశ్ : ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లలో 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ తెలిపింది. శాశ్వతంగా వలసపోయిన వారు, మరణించిన వారు, బహుళ రిజిస్ట్రేషన్లు వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు జరిగాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ప్రస్తుతం 12.55 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించినట్లు ఆయన వెల్లడించారు. తొలగించిన 2.89 కోట్ల మందిలో 46 లక్షల మంది మరణించారని, 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉత్తరప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల తొలగింపుల అనంతరం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. ఓటర్లు తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాను మార్చి 6న విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

# క్రికెట్ క్రీడా మైదానం ఏర్పాట్లు...

*** పనులను పరిశీలించిన ఉప సర్పంచ్ పి. పెంటయ్య**



అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోలు మండలం లోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఈ నెల 12 నుండి 15 వరకు జరుగనున్న గ్రామ స్థాయి టోర్నమెంట్ నిర్వహణకు సంబందించి ఏర్పాట్లను నిర్వాహకులు ప్రారంభించారు. క్రీడా పోటీలలో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ క్రీడలను నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం క్రికెట్ ఆడేందుకు అవసరమైన మైదానాన్ని చదును చేసే ఏర్పాట్లు చేశారు. మైదానం లో ఉన్న రాళ్లు, చెట్ల పొదలను ట్రాక్టర్ డోజర్ సహాయంతో చదును చేశారు. ఈ క్రీడలు గ్రామ సర్పంచ్ తెనుగు సునీత మహిపాల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నేపథ్యంలో గ్రామ ఉప సర్పంచ్ పిల్లోడి పెంటయ్య క్రీడా మైదాన ఏర్పాట్ల ను పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలకు సంబందించి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. క్రీడాల నిర్వహణపై నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. క్రీడలు స్నేహాభావంతో జరిగేలా చూడాలన్నారు.ఈ క్రీడల్లో గ్రామ యువకులు ప్రతి ఒక్కరు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చే వారు అందరూ కలిసేలా ఓ క్రీడా వేదికను ఏర్పాటు చేసి మూడేళ్లుగా క్రీడలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. క్రీడల ఆర్గనైజర్ తలారి బాలకృష్ణ, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాల్ రాజ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# నేలమ్మకు పునరుజ్జీవం – పంట వ్యర్థాలతో బయోచార్

*** భూమి ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు బయోచార్ వినియోగం కీలకం**

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: చుంచుపల్లి మండలం గరిమెళ్ళపాడు నర్సరీ ఆవరణలో ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై, ముఖ్యంగా బయోచార్ వినియోగంపై మంగళవారం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ బయోచార్ నిపుణులు పరశురం కైలాస్ అఖరే ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్ప వంటి పంట వ్యర్థాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో బయోచార్ తయారు చేసే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఇనుముతో తయారుచేసిన పరికరంలో పంట అవశేషాలను నియంత్రిత ఉష్ణోగ్రత వద్ద కాల్చి నాణ్యమైన బయోచార్ ఉత్పత్తి చేసే విధానాన్ని నిపుణులు వివరించారు. అనంతరం తయారైన బయోచార్‌ను గోమూత్రం, ఆవు పేడ మిశ్రమంలో 15 రోజుల పాటు ఉంచి సక్రియం (యాక్టివేషన్) చేసి ఎరువుగా వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ విధానం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూమి సారవంతత మెరుగుపడటంతో పాటు తేమ నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు సాగు అవుతున్నాయని తెలిపారు. పంట కోత అనంతరం రైతులు పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్పను పొలాల్లోనే కాల్చడం వల్ల నేలలోని విలువైన సూక్ష్మజీవులు పూర్తిగా నాశనం అవుతున్నాయని, దీంతో పాటు సేంద్రియ పదార్థం దగ్ధమై భూమి సారవంతత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వాతావరణ కాలుష్యానికి కారణమవుతూ మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందన్నారు. ఇకపై ఏ రైతు పత్తి కట్టెను పొలాల్లో కాల్చకుండా బయోచార్ తయారీకి ఉపయోగించాలన్నారు. బయోచార్‌లో ఉన్న సూక్ష్మ రంధ్రాల కారణంగా పంటలకు నీరు పెట్టిన సమయంలో యూరియా తదితర పోషక ఎరువులు వృథా కాకుండా అందులోనే నిల్వ ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ పోషకాలు నెమ్మదిగా పంటలకు అందడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. బయోచార్‌ను నేల తల్లికి అర్పించినట్లయితే, నేల తల్లి మనకు మెరుగైన ఫలితాలను అందిస్తుందని కలెక్టర్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఈ విధానాన్ని రైతులు విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా బయోచార్ వినియోగం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా డ్రైనేజీలు, పౌల్ట్రీ షెడ్లు, పశువుల శాలలు, చెత్త నిల్వ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ఉపయోగించవచ్చని తెలిపారు. దీని వల్ల దుర్వాసనలు తగ్గి గాలి పరిశుభ్రమవడంతో పాటు జీవన వాతావరణం మెరుగుపడుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి కూడా బయోచార్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బయోచార్‌ను పెద్ద ఎత్తున తయారు చేసి వినియోగించేందుకు రైతులు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు, పంచాయతీ సమన్వయంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విధంగా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జిల్లాలో సుస్థిరమైన, పర్యావరణహిత వ్యవసాయ విధానాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గ్రామ సర్పంచ్ వాడే రాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు వేముల కామేశ్వరరావు, శ్రీదేవి, ఎన్సిసి ఇంచార్జ్ ధర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్, రాంబాబు, బూర్గంపాడు, టేకులపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, దుమ్ముగూడెం, జూలూరుపాడు, గుండాల మండలాల ఎంపీడీవోలు అధ్యాపకులు రాజ్ కుమార్ సూపర్డెంట్ విజయ్ ప్రసాద్, వార్డు మెంబర్లు, విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

*** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్ హెచ్ ఓ లు ,కోర్టు డ్యూటీ ఆఫీసర్లు,రైటర్లు,టెక్ టీం ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పాత కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు.ఏవైనా సందేహాలు తలెత్తితే డీసిఆర్బీ అధికారులకు తెలియజేసి వాటిని నివృత్తి చేసుకోవాలని తెలిపారు.కేసు నమోదయినప్పటి నుండి పరిష్కారం అయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్లైన్లో పొందుపరిచాలని టెక్ టీం ఆపరేటర్లకు సూచించారు. ఆన్లైన్లో పొందుపరిచే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఐటీ సెల్ సహకారం తీసుకోవాలని అన్నారు.5ఎస్అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని,కేసులకు సంభందించిన ఫైళ్ళను క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు.నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము,ఇల్లందు ఇన్స్పెక్టర్ సురేష్,3టౌన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్,సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్,ఫింగర్ ప్రింట్స్ సీఐ అశోక్,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా చర్యలు

*** సైనిక్ పురి విద్యుత్ ట్రాన్స్మిషన్ డి ఈ అన్వర్ భాష**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : సైనిక్ పూరి డివిజనల్ పరిధిలోని కాలనీలలో ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపడతామని సైనిక్ పురి విద్యుత్ ట్రాన్స్మిషన్ డి ఈ అన్వర్ భాష పేర్కొన్నారు. కుషాయిగూడ,చర్లపల్లి ఎన్ ఎన్ కాలనీ సబ్ స్టేషన్ల పరిధిలోని కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన తక్షణమే మరమ్మతు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం రోజు కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి డిఇ అన్వర్ భాషకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ ఎన్ కాలనీ సబ్స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలుసుకొని అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నాగారం సబ్ స్టేషన్ నుంచి లింక్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం జరిగిందన్నారు.50 లక్షలతో కొత్తగా 11 కెవి బై ఫర్ కేషన్ ఫీడర్ ప్రారంభానికి సిద్ధం సబ్ స్టేషన్ల మీద భారం తగ్గించేందుకుగాను కొత్తగా 50 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన నాగార్జున కాలనీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి విద్యుత్ బై ఫర్ కేషన్ ఫీడర్ పనులు పూర్తికావచ్చాయన్నారు. వారం రోజుల వ్యవధిలో కొత్త విద్యుత్ ఫీడర్ ను ప్రారంభించి విద్యుత్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని డిఇ భాష తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి ఏ డి ఈ రాందాస్, కుషాయిగూడ సెక్షన్ ఏఈ బాలరాజ్, శివ సాయి నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు బర్ల రామచంద్రారెడ్డి, కొండగల్ల అశోక్, షాబాద్ దామోదర్ రెడ్డి, సత్యనారాయణ, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు

# దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

*** కెపిహెచ్బీ పోలీస్ స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కెపిహెచ్బీ పోలీస్ స్టేషన్ సీఐ రాజశేఖర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.పండుగ రోజుల్లో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని అవకాశంగా తీసుకుని దొంగతనాలకు పాల్పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఇంట్లో లేదా హాస్టల్‌లో ఉన్న నగదు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.ఇంటి భద్రతకు సంబంధించి ప్రధాన ద్వారాలకు సెంట్రల్ లాక్ సిస్టమ్‌తో పాటు సెక్యూరిటీ అలారాలు, మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. తాళాలు బయటకు కనిపించకుండా కర్టెన్లు వాడాలని, ప్రధాన ద్వారంతో పాటు కిటికీల తలుపులు పూర్తిగా మూసివేయాలని సూచించారు. ఇంట్లో ఒక గదిలో లైట్ వెలిగించి ఉంచడం దొంగలను భయపెట్టే చర్యగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు అమర్చుకుని వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పర్యవేక్షించాలని తెలిపారు. వాహనాల విషయంలో కూడా జాగ్రత్తలు అవసరమని సూచించారు. వాహనాలను ఇంటి లేదా హాస్టల్ పార్కింగ్‌లోనే నిలిపి, చైన్ లాక్ లేదా సెంట్రల్ లాక్ సిస్టమ్ వినియోగించాలని, టూ వీలర్లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చుకోవడం మరింత భద్రతనిస్తుందని చెప్పారు. సోషల్ మీడియా వేదికగా తమ ప్రయాణ వివరాలను స్టేటస్‌లుగా పెట్టకూడదని, ఊరికి వెళ్తున్న విషయాన్ని అపరిచితులతో పంచుకోవద్దని పోలీసులు స్పష్టం చేశారు. అలాగే ఇరుగుపొరుగు వారిని ఇంటిపై ఒక కన్ను వేసి ఉంచమని కోరాలని, పేపర్ బాయ్ పాలు వేసేవారిని ముందుగానే రావద్దని తెలియజేయాలని సూచించారు.కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా లేదా ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. స్వగ్రామాలకు వెళ్లే వారు ముందుగానే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇచ్చి వెళ్లాలని కూడా విజ్ఞప్తి చేశారు.ప్రజల సహకారంతోనే నేరాలను నియంత్రించగలమని, పై సూచనలు పాటిస్తే దొంగతనాలను సమర్థవంతంగా నివారించవచ్చని సీఐ స్పష్టం చేశారు.

# అమెరికా బలగాలు నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ సిఐటీయూ ర్యాలీ




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : వెనిజులా దేశ సార్వభౌమాధికారాన్ని కాలరాస్తూ ఆ దేశ అధ్యక్షుడైన మధురో , ఆయన భార్యను అమెరికా బలగాలు నిర్బంధించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్ నగర్ రైతు బజార్ నుండి శుభం హోటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వెనుజులకు మద్దతుగా పెద్ద ఎత్తున సంఘీభావం తెలియజేస్తున్నారన్నారు. ఒక స్వతంత్ర దేశ నేతను నిర్బంధించే దమ్ము తమకే ఉందన్న అహంకారాన్ని అమెరికా వెల్లడించిందన్నారు. వెనిజులాలోని చమురు నిక్షేపాలను దోచుకోవడమే ట్రంప్ అమెరికా అసలు లక్ష్యం భారత్ నన్ను సంతోష పెట్టకపోతే భారత్‌పై మళ్ళీ టారిఫ్‌లు విధిస్తామన్నారు. బెదిరింపులకు దిగడం అమెరికా దిగజారుడుతనానికినిదర్శనమని. వెనిజులా అధ్యక్షుడు మధురో ఆయన భార్యను వెంటనే విడుదల చేయాలని వెనుజులా నుండి అమెరికా సైన్యాన్ని వెనక్కు పిలవాలని లేనిపక్షంలో అమెరికా తగిన మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఈ దేవదానం, సిఐటియు నాయకులు జి వెంకన్న. కే శీను తిమ్మప్ప. మధు. గోపి మల్లారెడ్డి. యాదవరెడ్డి వీరేష్. తదితరులు పాల్గొన్నారు.

# మీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో యువతి ఆత్మహత్య



హైదరాబాద్ లోని మీర్‌పేట్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మీర్‌పేట్‌లోని హాస్టల్‌లో ఉంటున్న సరస్వతి అనే యువతి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థుల సమాచారంతో పోలీసులు హాస్టల్‌కు వచ్చి పరిశీలించారు. విద్యార్థినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నర్సాపురంవాసిగా గుర్తించారు. కూతురు సరస్వతి మృతిపై తండ్రి అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్, కోచింగ్ సెంటర్ యాజమాన్యం ఆరోపణలు చేశారు. వీరితో పాటు అశ్వాపురానికి చెందిన నందకిషోర్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీసులకు కంప్లైంట్ చేశారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ముసాయిదా ఓటరు జాబితాపై

# అభ్యంతరాలను లిఖితపూర్వకంగా సమర్పించాలి

**– జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మున్సిపాలిటీ ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు, లిఖితపూర్వకంగా నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. మంగళవారం ఐ డి ఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 01102025 నాటికి ఓటరుగా నమోదు అయిన ప్రతి వ్యక్తిని ఎపిక్ కార్డులో పేర్కొన్న చిరునామా ఆధారంగా ఆయా డివిజన్‌లకు సంబంధించిన ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించే అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించి, పరిష్కరించిన అనంతరం 10వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 106 వార్డులకు గాను 1,85,750 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ జాబితాలో పేరు, చిరునామా, వార్డు, ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకు వేర్వేరు వార్డుల్లో ఓట్లు నమోదై ఉండటంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు వార్డుల్లో నమోదు అయి ఉంటే, సంబంధిత దరఖాస్తుల ఆధారంగా వాటిని సరిచేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, అశ్వరావుపేట మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సిపిఎం తులసీరామ్, బిజెపి నోముల రమేష్, సిపిఐ శ్రీనివాస్, జే ఎస్ పి సందీప్, ఐ ఎన్ సి లక్ష్మణ్ అగర్వాల్, టిడిపి కళ్యాణ లక్ష్మీపతి, బీఎస్పీ శంకరయ్య, ఏ ఏ పి రమేష్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

## చెంగనూరులో తెలుగు అయ్యప్ప భక్తులకు ఘనంగా అన్నదానం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : మకరవిలకు సందర్భంగా శబరిమల యాత్రకు వచ్చే అయ్యప్ప భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో శబరిమలకు వెళ్లే తెలుగు ఉమ్మడి రాష్ట్రాల అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం చెంగనూరు రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో మహాశాస్త్ర సేవా సంఘం ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమం ఉప్పల్ రాజు గురుస్వామి ఆధ్వర్యంలో కొనసాగింది.ఈ సందర్భంగా తెలుగు సంప్రదాయ రుచులతో అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం అందించారు. శబరిమల యాత్రలో అలసటతో వచ్చే భక్తులకు ఈ అన్నదానం ఎంతో ఉపశమనంగా మారిందని భక్తులు తెలిపారు. హైదరాబాదు నుండి కేరళ రాష్ట్రంలోని శబరిమల ప్రాంతం వరకు తెలుగు భక్తుల కోసం నిరంతరంగా అన్నదానం నిర్వహించడం అభినందనీయమని రుద్రగోని వెంకటేష్ గౌడ్ గురుస్వామి పేర్కొన్నారు.ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రుద్రగోని వెంకటేష్ గౌడ్ గురుస్వామి తమ శిష్య బృందంతో కలిసి ఇతర రాష్ట్రాల అయ్యప్ప భక్తులకు కూడా స్వయంగా అన్నప్రసాద సేవలో పాల్గొన్నారు. సేవే పరమ ధర్మమనే భావనతో నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తుల మనసులను కదిలించింది.ఈ సేవా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని నిర్వాహకులు తెలిపారు.

## నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి తీసుకురావాలి

* **బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి తీసుకురావాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆకాంక్షించారు.నూతన సంవత్సరం సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు ఆయనను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లను కార్యకర్తలతో పాటు ఓం శాంతి సభ్యులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బిజెపి నిరంతరం పని చేస్తోందని తెలిపారు. కార్యకర్తలే పార్టీకి బలం అని, వారి అంకితభావం వల్లే ప్రజల మధ్య బిజెపి మరింత బలపడుతోందన్నారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేసే దిశగా సమిష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

## వైష్ణవి టెక్నో స్కూల్ లో ఘనంగా "పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్"

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి): పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత , సామాజిక అవగాహన పెంపొందుతుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీయూడబ్ల్యుజే (ఐజేయూ) అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అన్నారు. మంగళవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని సంజయ్పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్ లో "ద పవర్ ఆఫ్ ఆర్ట్ ఇన్స్పైర్ అండ్ ఇంపాక్ట్" (పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీయూడబ్ల్యుజే (ఐజేయూ ) అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, వైష్ణవి విద్యా సంస్థల చైర్మన్ చెప్యాల నర్సింహులు గౌడ్, అకాడమిక్ డైరెక్టర్ సాయిబాబాలు పాల్గొని విద్యార్థులు వేసి ప్రదర్శించిన చిత్రాలను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ప్రతి ఒక్క విద్యార్థి చాలా చక్కగా వేశారని అభినందించారు.పోస్టర్ మేకింగ్ పోటీల ద్వారా విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ బయటపడుతుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.









## తెలంగాణలో జర్నలిస్టుల జోలికి వస్తే ఊరుకోం

* **సుందర్ కల్లూరి**
* **సంఘాలు కాదు జర్నలిస్టుల సంక్షేమమే మాకు ముఖ్యం.**
* **జర్నలిస్టులను వేరు చేసి చూడడం తగదు.**
* **చిన్న పత్రికలకు, డిజిటల్ మీడియాకు అక్రిడేషన్ ఇవ్వాలి.**
* **జీవో 252 ని పునఃసమీక్షించాలి.**

ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : తెలంగాణలోని ప్రతీ జర్నలిస్ట్ కి న్యాయం జరగాలని రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు, చిన్న పత్రికలు, డిజిటల్ మీడియా అంటూ వేరు చేయడం తగదని, జీవో 252 ని పునఃసమీక్షించాలని, అర్హులైన ప్రతీ జర్నలిస్ట్ కి అక్రిడేషన్ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలన్నీ జర్నలిస్టులకు అందాలని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి డిమాండ్ చేసారు. తెలంగాణ వ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్నటువంటి జర్నలిస్ట్ ల జోలికి వస్తే మాత్రం ఎంతటి వారైనా సరే ఉపేక్షించే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. మీకు జరిగిన ఇబ్బంది మా దృష్టికి తీసుకొస్తే, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం మీ దగ్గరికి వచ్చి మీకు కొండంత అండగా ఉంటుందని జర్నలిస్టులందరికీ భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఆనం చిన్ని వెంకటేశ్వర్ రావు అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉపాధ్యక్షుడు సుందర్ కల్లూరి, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌటి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కీర్తి సంతోష్ రాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేణుగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సాయి గౌడ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## కృష్ణానదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జ్.. టెండర్లకు ఆహ్వానం పలికిన కేంద్రం

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల వద్ద కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ కేబుల్ వంతెనకు కేంద్రం టెండర్లు ఆహ్వానించింది. రూ.816.10కోట్ల అంచనా వ్యయంతో 1077 మీటర్ల పొడవున ఈహైబ్రిడ్ వంతెనను ఈపీసీ విధానంలో 36 నెలల్లో పూర్తి చేయనున్నారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే నంద్యాల, తిరుపతి వెళ్లే ప్రయాణికులకు కర్నూలు మీదుగా వెళ్లే అవసరం లేకుండా 90కి.మీ మేర దూరం తగ్గుతుంది. ఇది ఇరు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాకుండా పర్యాటకాన్ని కూడా ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు. కల్వకుర్తి నుంచి ప్రారంభమయ్యే 167



కె నంబర్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఈ కేబుల్ బ్రిడ్జ్ నిర్మిస్తున్నారు. కల్వకుర్తి నుంచి నాగర్ కర్నూలు, కొల్లాపూర్ సోమశిల, ఏపీలోని ఆత్మకూరు మీదుగా నంద్యాల వరకు ఈ హైవేను నిర్మిస్తారు. ఈ హైవే నిర్మాణంతో హైదరాబాద్ బెంగళూరు (ఎన్.హెచ్44) పై భారం కూడా తగ్గనుంది.

## టెన్త్ క్లాస్ విద్యార్థులకు చివరి అవకాశం



రాష్ట్రంలో మార్చి2026లో జరగనున్న పదో తరగతి, ఓఎస్ఎస్సీ, వృత్తి విద్యా కోర్సుల పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. వివిధ కారణాల వల్ల ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థుల కోసం తత్కాల్ స్కీమ్ కింద గడువును ప్రకటిస్తూ ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులతో పాటు గతంలో ఉత్తీర్ణులు కాని అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 21 నుండి 27 వరకు రూ.1000 ఆలస్య రుసుముతో హెడ్ మాస్టర్లకు ఫీజు చెల్లించాలని తెలిపారు. ఈ నెల 28న హెచ్ఎం ట్రెజరీలో ఫీజు జమ చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 29 వరకు విద్యార్థుల డేటాను ఆన్ లైన్ లో సమర్పించేందుకు అవకాశం కల్పించారు. మార్చి2026 పబ్లిక్ పరీక్షలకు రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు మాత్రమే తదుపరి నిర్వహించే అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కావడానికి అర్హులవుతారు. కాబట్టి, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం విద్యార్థులు తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

## టీజీఎస్ఆర్టీసీలో ఉద్యోగాలు.. 198 పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం..




రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ)లో ఖాళీగా ఉన్న 198 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ (టీఎస్‌టీ), మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ (ఎంఎస్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ వీవీ శ్రీనివాస్ రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2025 డిసెంబర్ 31న ప్రారంభమైన ఈ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియకు జనవరి 20 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సమయం ఉంటుందని పేర్కొన్నారు.

**ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగింపు లేదు**

జనవరి 20 తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించబడదని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సెలవుల దృష్ట్యా, అవసరమైన సర్టిఫికెట్లు డాక్యుమెంట్లు పొందడంలో జాప్యం జరిగే అవకాశం ఉందని అభ్యర్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆఖరి రోజుల్లో ట్రాఫిక్ పెరిగి సర్వర్ మొరాయించే అవకాశం ఉందని హెచ్చరించారు.

## వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య రాకుండా చూడాలి : మంత్రి సీతక్క

* **విద్యుత్ సరఫరా, పైపులైన్లకు ఇబ్బంది లేకుండా చూడాలి**
* **మిషన్ భగీరథ అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష**



తెలంగాణ బ్యూరో: వేసవిలో ఎక్కడా తాగునీటి కొరత రాకుండా అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో గ్రామీణ తాగునీటి సరఫరాపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈలు, ఎస్ఈలు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించాలని, సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కాదు, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పంపు సెట్లు పాడైన చోట్ల వెంటనే మరమ్మతులు చేపట్టాలని, చిన్న లోపాల వల్ల పెద్ద సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. గత ఏడాది పకడ్బందీ ప్రణాళికలతో రాష్ట్రంలో తాగునీటి సమస్యలు రాకుండా నియంత్రించగలిగామని మంత్రి గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా రిజర్వాయర్లలో తగినంత నీటి లభ్యత ఉందని, అయితే ఎప్పటికప్పుడు నీటి నిల్వలను అంచనా వేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదే సమయంలో, కొన్ని చోట్ల మిషన్ భగీరథ సిబ్బంది స్వలాభం కోసం అవసరం లేకపోయినా కొత్త బోర్లు వేయాలని ప్రోత్సహిస్తున్నారని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. అవసరం లేని కొత్త బోర్ల వల్ల డబ్బు, శ్రమ రెండూ వృథా అవుతున్నాయని, దీనిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

* **మేడారం జాతర నేపథ్యంలో తాగునీటికి ప్రత్యేక చర్యలు**

మేడారం మహా జాతర దృష్ట్యా తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జాతర సందర్భంగా ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులను ప్రత్యేకంగా నియమిస్తామని చెప్పారు. ఈ నెల 10వ తేదీన మేడారంలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు. జాతర కాలంలో నిరంతరం అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా అయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండటం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. మేడారం మహా జాతరకు ఆహ్వానిస్తూ మిషన్ భగీరథ సిబ్బంది తరుపున ఈఎన్సీ కృపాకర్ రెడ్డికి మంత్రి సీతక్క ఆహ్వానపత్రిక ఇచ్చారు.

# పేమెంట్ కోటాలో రేవంత్‌కు సీఎం పదవి: కేటీఆర్

జనగామ టౌన్: కాంగ్రెస్‌లో అనేక మంది సీనియర్లను కాదని పేమెంట్ కోటాలో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆరోపించారు. జనగామ జిల్లా కేంద్రంలో మంగళవారం నూతనంగా గెలిచిన బీఆర్ఎస్‌కు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''ఏ వాగు, ఏ వంక ఎక్కడ ఉందో సీఎంకు తెలియదు. దేవాదుల.. గోదావరి కిందనే ఉందా? అని అడగటం ఆయన అజ్ఞానాన్ని తెలియజేస్తుంది. అలాంటి వ్యక్తి శాసనసభలో నీళ్ల గురించి.. కేసీఆర్‌కు చెబుతారట.. ఇంతకంటే హాస్యాస్పదం మరొకటి ఉండదు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్‌రెడ్డి అంటున్నారు.. దశాబ్దాలుగా ఆంధ్ర పాలకుల ఆధిపత్యం కింద నలిగిపోతున్న తెలంగాణను స్వరాష్ట్రం సాధించినందుకు చంద్రశేఖర్ రావును ఉరి తీస్తారా? నేను మా



నాన్న పేరు చెప్పుకొంటానని సీఎం ప్రచారం చేస్తున్నారు.. బరాబర్ చెబుతా.. తెలంగాణ తెచ్చిన వ్యక్తి మా నాన్న. ఆ విషయంలో మీకొచ్చిన సమస్యేంటీ? చరిత్రలో కిరణ్‌కుమార్‌రెడ్డి అనే ముఖ్యమంత్రిని మరిచిపోయినట్లు రేవంత్‌రెడ్డికి ఆ గతి పడుతుంది' అని విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నన్నపునేని నరేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




## భూ వివాదం.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నగ్నంగా నిరసన

కుల్కచర్ల: తండ్రి ఆస్తి తమకే దక్కాలని ఓ కుమారుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నగ్న ప్రదర్శనకు దిగిన ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మల్కాపూర్ గ్రామానికి చెందిన హన్మయ్యకు సర్వే నెంబర్ 42లో 7.29 ఎకరాల భూమి ఉంది. మూడేళ్ల క్రితమే అతను మృతి చెందాడు. అతడి మొదటి భార్య హన్మమ్మకు సంతానం లేరు. దీంతో ఆమె సోదరి ఈశ్వరమ్మను రెండో వివాహం చేసుకోగా.. ఆమె నలుగురు సంతానం. వారు గూడూరులో నివాసం ఉంటున్నారు. మొదటి భార్య ఆ భూమిని తమకు విరాసత్ చేయాలంటూ.. చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో గతనెలలో స్లాట్ నమోదు చేసుకుంది. సరైన పత్రాలను సమర్పించలేదని అధికారులు తిరస్కరించారు. కాగా, హన్మయ్యకు తాను మూడో భార్య కుమార్తెనని కావలి యాదమ్మ కూడా రెవెన్యూ అధికారులను కలసి ఆ భూమి తమకే దక్కాలంటూ దరఖాస్తు చేసింది. దీంతో అధికారులు ఎవరికీ భూమి విరాసత్ చేయలేదు. అధికారులు తగిన నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతుండడంతో ఆందోళనకు గురైన రెండో భార్య కుమారుడు సతీష్ రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం నగ్నంగా ఆందోళనకు దిగాడు. న్యాయంగా భూమి తమ కుటుంబానికే దక్కాలని అధికారులతో వాగ్వాదానికి దిగడంతో చాలా సేపు గందరగోళం నెలకొంది. తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్పందించి సతీష్‌తో మాట్లాడి పూర్తి స్థాయి విచారణ అనంతరం చట్ట ప్రకారం ఎవరు వారసులో వారికి భూమి చెందేలా తగిన నిర్ణయం తీసుకుంటామని సర్దిచెప్పారు. దీంతో అతడు ఆందోళన విరమించాడు.

## రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఎవరూ ఆపలేదు.. ఎన్జీటీయే ఆపింది: వెదిరె శ్రీరాం

హైదరాబాద్: 90 శాతం పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎవరూ ఆపలేదని, నేషనల్ గ్రీన్ ట్రైబ్యున్(ఎన్జీటీ) ఆపిందని జలశక్తి శాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరాం అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో కృష్ణాగోదావరి నదీ జలాల కేటాయింపులపై వెదిరే శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ''2014 నుంచి 2024 వరకు తెలంగాణ లిఫ్ట్ చేసిన నీటి కన్నా ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నీటిని తరలించింది. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకి హైడ్రాలిక్ క్లియరెన్స్, ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ లేవు. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు, ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా కేంద్ర ప్రభుత్వం వెనక్కి పంపింది. సరైన వివరాలు ఇవ్వకపోవడంతో కేంద్రం తిప్పి పంపింది. ఇవ్వాల్సిన.. లీగల్, టెక్నికల్ డేటా ఇస్తే 45 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతి వస్తుంది. మిగతా 45 టీఎంసీల కోసం ట్రైబ్యునల్‌లో గట్టిగా వాదిస్తే అనుమతులు వస్తాయి. 2014కు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం జీవోలు ఇచ్చింది.. కానీ, నీటి కేటాయింపులు మాత్రం చేయలేదు. ఆ తరువాత కేసీఆర్ 299 టీఎంసీలకు సంతకం చేసి.. తెలంగాణకు వచ్చిన అవకాశాన్ని కోల్పోయారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధిలేదు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. దీనికి కేసీఆర్



ఏం సమాధానం చెబుతారు. కేఆర్ఎంబీ కొత్తగా నీటి కేటాయింపులు చేయదు'' అని పేర్కొన్నారు.

## పరిశ్రమలను మూసివేసేలా హిల్ట్ పాలసీ: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: జీవో 27 చాలా వివాదాస్పదంగా ఉందని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ''జీవో లీక్ కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉంది. టౌన్‌షిప్‌లు, అపార్ట్‌మెంట్‌లు ఉండాలని జీవో 27లో ఉంది. అతితక్కువ ధరకు భూములు ఇచ్చారు. హిల్ట్ పాలసీకి సంబంధించి సబ్ కమిటీ



నిర్ణయాలను బయటపెట్టలేదు. 22 పారిశ్రామికవాడలను అన్యాక్రాంతం చేస్తున్నారు. ఫార్మాసిటీకోసం రైతుల నుంచి సేకరించిన భూములను ఫోర్త్ సిటీకి ఉపయోగిస్తున్నారు. ఆ భూములపై హైకోర్టు అఫిడవిట్ అడిగింది. పరిశ్రమలను మూసివేసేలా ప్రస్తుత పాలసీ ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉంది. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలో తప్పులు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల భూములను రియల్ ఎస్టేట్ భూములుగా మార్చాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. భారత రాష్ట్ర సమితికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,342 జీవోలు దాచి పెట్టింది. ప్రస్తుత ప్రభుత్వం 19,064 జీవోలు ఇస్తే.. 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయి'' అని ఆరోపించారు.

## డ్రగ్స్ కేసు.. హైకోర్టును ఆశ్రయించిన ప్రముఖ నటి సోదరుడు

హైదరాబాద్: ప్రముఖ నటి సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ హైకోర్టును ఆశ్రయించాడు. మాసబ్ ట్యాంక్ పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని పిటిషన్ వేశాడు. డ్రగ్స్ కేసులో అమన్‌ప్రీత్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. మాదకద్రవ్యాల విక్రేతల నుంచి డ్రగ్స్‌ను కొనుగోలు చేసినట్లు కేసు నమోదైంది. అప్పటి నుంచి అమన్ పరారీలో ఉన్నాడు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేపట్టకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 9వ



తేదీకి వాయిదా వేసింది.

## హైదరాబాద్‌వాసులను కాలుష్యం నుంచి రక్షించాలనేదే మా లక్ష్యం

**: మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్: రేపటి తరాల భవిష్యత్ కోసం హిల్ట్‌పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హిల్ట్‌పాలసీపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ''హిల్ట్‌పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారు. దీనిపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తాం. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం.. నివాస ప్రాంతంగా మారుతుంది. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారు. నగరంలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు



తరలిస్తాం. ఈ పాలసీ మేము కొత్తగా చేస్తున్నది కాదు. దీనికోసం విస్తృతంగా చర్చలు జరిగాయి. వనరులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. హిల్ట్ పాలసీ గురించి తెలియకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. పారిశ్రామికవేత్తల భూములను.. ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారు. జీవో ఎంఎస్ 19కు సంబంధించి లీజు భూములపై ప్రభుత్వానికి సర్వాధికారులు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చింది. స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూములు కన్వర్ట్ చేస్తాం. నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే మా లక్ష్యం. మా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హేతుబద్ధత, శాస్త్రీయత ఉండాలని చూస్తున్నాం. భవిష్యత్ గురించి ఆలోచించే మా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది'' అని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు.

## 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్

**: భట్టి విక్రమార్క**

హైదరాబాద్: సింగరేణి కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ''32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం'' అని భట్టి విక్రమార్క తెలిపారు.



## తెలంగాణలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి

**: ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి**

హైదరాబాద్: కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. తెలంగాణ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. ''ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి'' వెంకట రమణారెడ్డి అన్నారు.

**పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇవ్వాలి: పాల్వాయి హరీశ్‌బాబు**

త్రీవీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని మరో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ



తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఐదు రోజుల పాటు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. మొత్తం 40 గంటల 45 నిమిషాల పాటు సభ్యులు చర్చ చేశారు. ఆమోదం పొందిన బిల్లుల్లో తెలంగాణ పురపాలికల(నాలుగో సవరణ)బిల్లు, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్(సవరణ) బిల్లు, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్(రెండో సవరణ) బిల్లు, తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల(స్థాపన, క్రమబద్ధీకరణ) బిల్లు, తెలంగాణ మోటారు వాహనాలపై పన్ను విధింపు(సవరణ), తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ ఎపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాటర్న్ పేస్ట్రక్చర్ బిల్లు, తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఎమెండ్‌మెంట్) బిల్లులు ఉన్నాయి.

## హైదరాబాద్‌లో మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ సందడి



భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్‌ను బిగ్ అకాడమీ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. ఆయన విజయవంతమైన ప్రయాణం అకాడమీ విశ్వసించే క్రమశిక్షణ, పట్టుదల ఏకాగ్రతల సమ్మేళనంతో సరిపోల్చదగినదిగా పేర్కొంది. హైదరాబాద్ నగరంలోని నోవోటెల్ హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో భారత క్రికెటర్ యువరాజ్ సింగ్, నటుడు బ్రహ్మానందం, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీవీ ఆనంద్, బిగ్ టీవీ వ్యవస్థాపకుడు ఛైర్మన్ విజయ్ రెడ్డి, బిగ్ టీవీ మలయాళం వ్యవస్థాపక డైరెక్టర్ మేనేజింగ్ ఎడిటర్ అనిల్ ఆయూర్‌లతో కలిసి బిగ్ అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టార్ క్రికెటర్ యువరాజ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న విద్యా వ్యవస్థలో ఆవిష్కరణ జవాబుదారీతనాల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు.

# అక్కడ దీపం వెలిగించొచ్చు: 'కార్తిక దీపం' ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు

చెన్నై: తిరుప్పరకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించే విషయంలో తమిళనాడు డీఎంకే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మదురైలోని ఈ కొండపై ఉన్న దీప స్తంభంలో దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ తాజాగా సమర్థించింది. ఆ స్తంభంలో దీపం వెలిగించొద్దని ఆగమశాస్త్రంలో పేర్కొన్నట్లు వ్యాజ్యదారులు బలమైన ఆధారాలు చూపించలేకపోయారని డివిజన్ బెంచ్ వెల్లడించింది. ఈ సందర్భంగా దీపం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం తిరస్కరించింది. ఏడాదిలో ఒకరోజు ఆ స్తంభంలో దీపం వెలిగిస్తే శాంతిభద్రతలకు ఆటంకం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదమని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని అనవసరంగా రాజకీయం చేశారంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ దీపస్తంభం సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి చెందినదే అని న్యాయస్థానం స్పష్టం చేసింది.



**కేసు వివాదం ఇదీ..**

తిరుప్పరకుండ్రం కొండపై ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద కార్తిక దీపోత్సవం సందర్భంగా ఏటా దీపం వెలిగిస్తారు. అయితే, ఈ కొండపై సికందర్ దర్గాకు 15 మీటర్ల దూరంలో ఉన్న దీపస్తంభం పైనా దీపం వెలిగించేందుకు అనుమతినివ్వాలంటూ రామ రవికుమార్ అనే వ్యక్తి గతేడాది డిసెంబరులో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై బెంచ్ సింగిల్ జడ్జి.. ఆ స్తంభంపైనా దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. అక్కడ ఏర్పాట్లు చేయలేదని పిటిషనర్ మళ్లీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మదురై బెంచ్ వద్ద భద్రతా విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బందితో వెళ్లి దీపం వెలిగించుకోవచ్చని పిటిషనర్‌కు సూచిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకుల తరపున కార్తిక దీపం వెలిగించారు. దర్గా సమీపంలో దీపం వెలిగించేందుకు రామ రవికుమార్, హిందూ నేతలతో ప్రయత్నించగా.. తోపులాట జరిగి పలువురు పోలీసులు గాయపడ్డారు. దీంతో ఈ కొండ వద్ద 144 సెక్షన్ విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, దర్గా ప్రతినిధులు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనే తాజాగా డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది.

## 'వెనెజువెలా'తో పోలుస్తూ కాంగ్రెస్ నేత వ్యాఖ్యలు.. భాజపా స్ట్రాంగ్ కౌంటర్!

మహారాష్ట్ర మాజీ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేసినట్లుగా ప్రధాని మోదీతో ట్రంప్ వ్యవహరిస్తారా? అని వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై భాజపా తీవ్ర స్థాయిలో మండిపడింది. ఆ పార్టీ స్థాయి రోజురోజుకు దిగజారుతోందని..



దేశంలో ఉద్రిక్తతలు కోరుకుంటోందని విమర్శలు గుప్పించింది. "కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్ భారత్ పరిస్థితిని వెనెజువెలాతో పోలుస్తుండటం సిగ్గుచేటు. అక్కడేం జరిగిందో.. ఇక్కడా అదే జరుగుతుందా? అని అడుగుతోంది. కాంగ్రెస్ వ్యాఖ్యలు భారత వ్యతిరేక మనస్తత్వాన్ని స్పష్టం చేస్తున్నాయి" అని భాజపా అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ పేర్కొన్నారు. అంతకుముందు.. మరో ఇంటర్వ్యూలోనూ చవాన్ ఇదే విధంగా మాట్లాడారు. వెనెజువెలాలో ఏం జరిగిందో భారత్‌లోనూ అలా జరగవచ్చన్నారు. అక్కడ పరిణామాలు ఐరాస చార్టర్‌కు విరుద్ధమని, అటువంటి సంక్షోభంపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు.

## 'సర్'పై మమత ఫైర్.. ఆ యాప్ వాడుతున్నారంటూ ఈసీపై ఆరోపణలు!

ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'సర్' ప్రక్రియ కోసం భాజపా ఐటీ విభాగం అభివృద్ధి చేసిన యాప్‌ను ఈసీ చట్టవిరుద్ధంగా వినియోగిస్తోందని ఆరోపించారు. గంగాసాగర్ మేళా ఏర్పాట్లను సమీక్షించేందుకు దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సాగర్ ఐలాండ్‌లో తన రెండు రోజుల పర్యటన ముగింపు సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సంఘం రాజ్యాంగ విరుద్ధమైన, ప్రజాస్వామిక వ్యతిరేక, తప్పుడు పద్ధతులను అవలంబిస్తోందని ఆరోపించారు. "సర్ ప్రక్రియను ఈసీ అన్ని రకాలుగా తప్పులుతడకలుగా నిర్వహిస్తోంది. వృద్ధులు, అనారోగ్యంగా, బలహీనంగా ఉన్నవారిని విచారణలకు రావాలని బలవంతం చేస్తూ వేధిస్తోంది. అర్హులైన ఓటర్లను చనిపోయినట్లుగా చూపిస్తోంది. 'సర్' కోసం



భాజపా ఐటీ విభాగం రూపొందించిన యాప్‌ను వాడుతోంది. ఇది అప్రజాస్వామికం. రాజ్యాంగ విరుద్ధం. ఇలా సాగడానికి వీలు లేదు" అని మమతా బెనర్జీ అన్నారు. మరోవైపు, మమతా బెనర్జీ ఆరోపణలను భాజపా తిప్పికొట్టింది. ఆమె ఆరోపణలన్నీ నిరాధారం, రాజకీయ ప్రేరేపితమైనవని కొట్టిపారేసింది.



## తండ్రిని కడసారి చూసుకునేందుకు.. బంగ్లాతో విభేదాల వేళ జవాన్ల మానవత్వం!

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ బీఎస్ఎఫ్ దళాలు తమ మానవత్వాన్ని చాటుకున్నాయి. పశ్చిమబెంగాల్‌లో మృతి చెందిన తన తండ్రిని కడసారి చూసేందుకు బంగ్లాదేశ్‌లో ఉంటున్న ఓ మహిళకు అవకాశం ఇచ్చారు. ఈ ఘటనపై అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగాల్‌కు చెందిన ఉమ్మెహరా బీబీ అనే మహిళకు కొన్నేళ్ల క్రితం బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. నాటి నుంచి ఆమె అక్కడే ఉంటుంది. తాజాగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో బంగ్లా పౌరులు భారత్‌లో ప్రవేశించడంపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా ఆమె తండ్రి ఇస్రాఫిల్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఉమ్మెహరా బీబీ తన తండ్రిని ఆఖరిసారి చూసేందుకు అవకాశమివ్వాలని ఫోన్ ద్వారా బెంగాల్‌లోని గ్రామ అధికారులను కోరింది. ఆ విషయాన్ని వారు బెంగాల్ సరిహద్దులోని బీఎస్ఎఫ్ అధికారులకు తెలియజేశారు. ఆమె ఆవేదనను అర్థం చేసుకొన్న బీఎస్ఎఫ్ అధికారులు సరిహద్దులోని జీరో పాయింట్ వద్ద బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ అధికారులతో ఫ్లాగ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం భారత సరిహద్దు వద్దకు రావాల్సిందిగా ఆమెకు సమాచారమిచ్చారు. బీఎస్ఎఫ్ అధికారులు వృద్ధుడి మృతదేహాన్ని బెంగాల్ సరిహద్దు వద్దకు తెప్పించారు. అధికారులు చూపిన చొరవతో ఆమె తన తండ్రిని కడసారి చూసుకొని నివాళులు అర్పించింది.

# టీవీకే అధినేత విజయ్‌కు సీబీఐ నోటీసులు

తమిళనాడులోని కరూర్ తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్‌కు నోటీసులు జారీ చేసింది. ఈనెల 12న దిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే టీవీకే పార్టీకి చెందిన అనేక మంది ఆఫీస్ బేరర్లను సీబీఐ ప్రశ్నించింది. ఈ క్రమంలోనే పార్టీ అధినేత విజయ్‌ను ప్రశ్నించేందుకు సిద్ధమైంది.



ఆయన్ను విచారించిన అనంతరం ఈ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కరూర్‌లో గతేడాది సెప్టెంబరు 27న టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచారసభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై తొలుత రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేయగా..సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు బాధ్యతలు తీసుకుంది. దర్యాప్తులో భాగంగా తొక్కిసలాటకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తోంది.

## బస్సులు లేకపోతే సామాన్యులెలా ప్రయాణిస్తారు?: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

దేశ రాజధాని దిల్లీ, పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం తీవ్రత కొనసాగుతోన్న విషయం తెలిసిందే. దిల్లీలో వాయు కాలుష్యంపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధానిలో పెరుగుతున్న వాయు కాలుష్యానికి బస్సులు, ట్రక్కులే కారణమని చెప్పడం చాలా సులువని.. కానీ, వాటిని నిలిపివేస్తే సామాన్య ప్రజలు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. కాలుష్యం ప్రస్తావన వచ్చినప్పుడల్లా రైతులను నిందించడం సరికాదంటూ వ్యాఖ్యానించింది. ఈ సమస్యపై ఊహలకు బదులు శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ను ఆదేశించింది. బస్సులు, ట్రక్కులు, పంట వ్యర్థాల దహనం తదితర కారణాల వల్ల దిల్లీలో కాలుష్య సమస్య తీవ్రమవుతోందని అధికారులు నివేదికలో పేర్కొనడంపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కొవిడ్ సమయంలో రైతులు పెద్ద మొత్తంలో పంట వ్యర్థాలను తగలబెట్టినప్పటికీ దిల్లీలో కాలుష్య సమస్య రాలేదని సుప్రీం కోర్టు ప్రస్తావించింది. ప్రస్తుత కాలుష్యానికి పంట



వ్యర్థాల దహనం, వాహనాలు మాత్రమే కాకుండా ఇంకా సంక్లిష్టమైన కారణం ఉండొచ్చని అభిప్రాయపడింది. ఈ సమస్యకు గల ప్రధాన కారణాన్ని గుర్తించగలిగారా? అని అధికారులను ప్రశ్నించింది. కాలుష్య సమస్యపై లోతైన విశ్లేషణ చేయాల్సిన అవసరముందని అధికారులకు సూచించింది. ముందుగా కాలుష్యానికి గల ప్రధాన కారణాలను గుర్తించి.. తర్వాత దాన్ని ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన పరిష్కారాలను కనుగొనాలని ఆదేశించింది. కాలుష్య నివారణ చర్యలపై ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని సూచించింది

# కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడి కన్నుమూత

కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడి (81) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పుణెలో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో రైల్వేశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా, దిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడల నిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా సేవలందించారు. 1964 నుంచి 1972 వరకు వాయుసేనలో పైలట్‌గా ఉన్నారు. 1965, 1971 ఇండోపాక్ యుద్ధాల్లోను పాల్గొన్నారు. 1944 మే 1న తమిళనాడులోని మద్రాసులో కల్మాడి



జన్మించారు. మహారాష్ట్ర పుణేలోని సెయింట్ విన్సెంట్‌లో హైస్కూల్ విద్యను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫెర్గూసన్ కళాశాల నుంచి డిగ్రీ పట్టా పొందారు. ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో (NDA) సైనిక శిక్షణ తీసుకొన్న ఆయన.. జోధ్‌పూర్, అలహాబాద్‌లోని ఎయిర్‌ఫోర్స్ ఫ్లయింగ్ కాలేజీలో పైలట్‌గా శిక్షణ పొందారు. కొన్నేళ్లు వాయుసేనలో పైలట్‌గా పనిచేశారు. 1982లో అధికారికంగా రాజకీయాల్లోకి వచ్చిన కల్మాడి.. శరద్‌పవార్ నేతృత్వంలోని కాంగ్రెస్ (ఎస్) మద్దతుతో మహారాష్ట్ర నుంచి స్వతంత్ర సభ్యుడిగా రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన అనేక కీలక పదవులు చేపట్టారు.

# పిజ్జా సేల్స్ పెరిగితే యుద్ధానికి సంకేతమా..!

## ఏంటీ 'పెంటగాన్ పిజ్జా థియరీ'?

పెంటగాన్ చుట్టుపక్కల పిజ్జా ఆర్డర్లు పెరిగాయంటే ప్రపంచంలో ఏదో మూల అలజడి మొదలైనట్టే..! ఇది ఎప్పట్నుంచో ఉన్న ప్రచారం. అందుకు తగ్గట్లే గత శనివారం తెల్లవారుజామున కూడా అమెరికా రక్షణ కార్యాలయం సమీపంలో పిజ్జా అవుట్‌లెట్లకు ఒక్కసారిగా ఆర్డర్లు పెరిగాయి. అదే సమయంలో వెనెజువెలాపై అమెరికా బలగాలు అనూహ్య దాడి చేయడంతో ఈ 'పెంటగాన్ పిజ్జా థియరీ'పై మరోసారి నెట్టింట చర్చ మొదలైంది. మరి సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నట్లుగా ఈ థియరీ నిజమేనా? పెంటగాన్ పరిసర ప్రాంతాల్లో పిజ్జా సేల్స్ పెరిగితే.. అది యుద్ధానికి సంకేతమా? అమెరికా సైనిక ఆపరేషన్ల సమయంలో పెంటగాన్ చుట్టుపక్కల పిజ్జా డెలివరీలు అమాంతం పెరుగుతాయనేది కొన్నేళ్లుగా వినిపిస్తోన్న వాదన. అందుకు తగ్గట్లుగానే 'పెంటగాన్ పిజ్జా రిపోర్ట్' పేరుతో కొందరు ట్రాకర్లు ఇచ్చిన నివేదికలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంటాయి. శనివారం తెల్లవారుజామున కూడా పెంటగాన్ సమీపంలోని పిజాటో పిజ్జా అవుట్‌లెట్‌లో సేల్స్ పెరిగినట్లు ఓ ట్రాకర్ పోస్ట్ చేశారు. ఆ రోజున తెల్లవారుజామున 2 గంటల నుంచి 3.30 గంటల వరకు విపరీతంగా ఆర్డర్లు వచ్చినట్లు పేర్కొన్నారు. గంటన్నర తర్వాత ఒక్కసారిగా ఈ అవుట్‌లెట్‌కు 'జీరో ట్రాఫిక్' కన్పించినట్లు తెలిపారు. ఈ ట్రాకర్ పేర్కొన్న సమయంలోనే వెనెజువెలా పై అమెరికా దాడి చేసి ఆ దేశాధ్యక్షుడిగా ఉన్న నికోలస్ మదురో, ఆయన సతీమణిని నిర్బంధించి అగ్రరాజ్యానికి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

**ప్రచ్ఛన్న యుద్ధం నుంచే ట్రెండ్..**

సాధారణంగా అమెరికా సైనిక ఆపరేషన్లు, అత్యవసర సమయాల్లో రక్షణశాఖ, ఇంటెలిజెన్స్ అధికారులు రాత్రంతా ఆఫీసుల్లోనే ఉండి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆ సమయంలో వారు క్విక్ ఫుడ్ డెలివరీలపైన ఆధారపడతారని, అందుకే పెంటగాన్ చుట్టుపక్కల పిజ్జా డెలివరీలు పెరుగుతాయనేది ఈ 'పెంటగాన్ పిజ్జా థియరీ' సారాంశం. ఇది కేవలం ప్రచారమే అని కొందరంటారు. యాదృచ్ఛికంగా అలా జరుగుతోందని మరికొందరంటారు. అయితే ఇలా బయటకు వచ్చిన పిజ్జా సేల్స్ రిపోర్టులు నిజమైన సందర్భాలూ ఉన్నాయంటూ కొన్ని ఉదాహరణలు చెబుతారు చాలా మంది. అయితే, ఈ



ట్రెండ్ ఈ మధ్యకాలంలో వచ్చింది కాదు. ప్రచ్ఛన్న యుద్ధం సమయంలోనే ఈ థియరీ వెలుగులోకి వచ్చింది. అప్పట్లో అమెరికా సైనికాధికారుల కదలికలను గమనించేందుకు అగ్రరాజ్య ప్రభుత్వ భవనాల సమీపంలో వచ్చిన పిజ్జా ఆర్డర్లను సమీక్షించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ఇక, 1990లో కువైట్‌పై ఇరాక్ దండయాత్రకు ముందు అమెరికా సీఐఏ కార్యాలయానికి పిజ్జా ఆర్డర్లు పెరిగాయట. ఇక, 1999లో సెర్బియాలో జరిగిన బాంబుదాడులు, 2003 ఇరాక్ యుద్ధం, 1989లో పనామాపై అమెరికా దాడి, 2022 రష్యా ఉక్రెయిన్ యుద్ధం, 2024 25లో ఇరాన్ ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు వంటి సందర్భాల్లోనూ ఈ పిజ్జా ఆర్డర్లు పెరిగినట్లు చెబుతున్నారు.

# అల్లికలు... గోళ్ల మీదా!



**శీతకాలం అనగానే గుర్తొచ్చేది ఊలు దుస్తులే కదూ! ఒకప్పటిలా కాదు వాటిలోనూ ఎన్నో ఫ్యాషన్లు. మరి అన్నింటా మ్యాచింగ్‌ని ఫాలో అయ్యే అమ్మాయిలు ఈ దుస్తుల్ని మాత్రం ఎందుకు వదలాలి అనుకున్నారేమో! 'స్వెటర్ నెయిల్స్' అంటూ గోళ్ల మీదా అల్లికల్ని తెచ్చేశారు. కేబుల్ నిట్, ప్లెయిడ్, ఆర్గెల్... వంటి ఎన్నో ఉన్ని అల్లికలను అచ్చు గుద్దినట్టు దింపేస్తున్నారు. సాఫ్ట్ బెయిజ్... దాని పక్కనే బ్రౌన్ రంగు షేడ్... లేదంటే నచ్చిన ముదురు రంగుకు తెలుపును జత చేస్తూ ఇంకా కావాలంటే ఒకే రంగుతోనూ ఎన్నెన్ని డిజైన్లో! ఏదైనా ఆకర్షించడం మాత్రం ఖాయం. కాబట్టే, స్వెటర్ నెయిల్స్‌కి 'అల్టిమేట్ కోల్డ్ వెదర్ మానిక్యూర్ ట్రెండ్'గానూ పేరొచ్చింది. 'వింటర్ వైబ్' అంటూ సోషల్‌మీడియాలోనూ వైరలవుతోంది. స్నో, గ్లిటరీ రంగులు, ప్లెయిడ్ తరహా డిజైన్లకైతే అభిమానులూ బోలెడు. మరి మీ సంగతేంటి? మీకూ నచ్చాయా ఈ స్వెటర్ నెయిల్స్? ఇంకేం ఆన్‌లైన్‌లో డీఐవై చూసి ప్రయత్నించేయండి మరి!**













# వంటింటి వ్యర్థాలు... పోషకాలు!



**మొక్కలు పెంచడం అందరికీ సరదానే. కొన్నాళ్లు బాగానే పూసినా తర్వాత ఆ మట్టిలో సారం తగ్గి నిర్జీవంగా మారిపోతుంటాయి. ఇలాంటప్పుడు దాన్ని సులువుగా ఎలా సారవంతం చేసుకోవాలో తెలుసా?**

ఒక ఖాళీ కుండీని తీసుకోండి. అడుగున ఒక లేయర్ చిన్న చిన్న రాళ్లు వేయండి. ఆపై రెండు వరుసల్లో మట్టిని వేసి ఉంచండి. దీనిపై కూరగాయల వ్యర్థాలు, పండ్ల తొక్కలు వంటివి వేసి పైన మరోసారి మట్టి వేయండి. ఇలా ఒకదాని తర్వాత మరొకటి వేస్తూ కాసిని నీళ్లు చల్లుతూ ఉండండి. నెలరోజుల లోపే ఆ మట్టి సారవంతంగా మారుతుంది.

మొక్క చుట్టూ ఉండే మట్టి తరచూ బిగుసుకుపోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఎండిన ఆకుల్ని పొడి చేసి మట్టిలో కలిపేయండి. ఇది మట్టిని



గట్టిపడనివ్వదు.

# ప్రొటీన్ల కోసం..!

**కండర వ్యవస్థను దృఢంగా ఉంచడంలో ప్రొటీన్ల పాత్ర మనకు తెలిసిందే. శరీరం బలంగా, ఆరోగ్యంగా ఉండేందుకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకూ దోహదం చేసే ప్రొటీన్లు.. కేవలం మాంసాహారంలోనే కాదు.. కొన్ని రకాల శాకాహార పదార్థాలలోనూ అధికంగానే లభిస్తాయి. మరి వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే ప్రొటీన్ల లోపాన్ని అధిగమించవచ్చంటున్నారు నిపుణులు. మరి అవేంటో చూద్దాం రండి..**



## క్వినోవా

ప్రొటీన్ల లోపంతో బాధపడే వారికి క్వినోవా మంచి ఆహారం. వీటిలోని అన్‌శ్యాచురేటెడ్ కొవ్వులు, క్యాల్షియం, మాంగనీస్, పొటాషియం, ఫాస్ఫరస్, కాపర్, జింక్, బి6, ఇ, నియాసిన్, థయమిన్.. వంటి విటమిన్లు, పోషకాలు శరీరానికి ఆరోగ్యాన్ని అందిస్తాయని చెబుతున్నారు నిపుణులు. ఇక అమైనో ఆమ్లాలు, ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాల రూపంలో శరీరానికి అవసరమైన కొవ్వులు కూడా క్వినోవాలో ఉంటాయట. పీచు పదార్థాలు అధికంగా ఉండే క్వినోవా బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారమంటున్నారు నిపుణులు.

## ఓట్స్

ప్రొటీన్లే కాదు అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉండే ఓట్స్‌ను 'సూపర్‌ఫుడ్' అని పిలుస్తుంటారు. ఇందులో కార్బొహైడ్రేట్లు, పీచుపదార్థాలు, మాంగనీస్, ఫాస్ఫరస్, కాపర్, ఐరన్, సెలీనియం, మెగ్నీషియం, జింక్ లాంటి మినరల్స్ కూడా ఉంటాయి. పాలు, తేనె మొదలైన వాటితో కలిపి ఓట్స్‌ను తీసుకుంటే శరీరానికి మరిన్ని పోషకాలు అందుతాయని చెబుతున్నారు నిపుణులు.

## సబ్జా

బరువు తగ్గించుకుని రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలనుకునే వారికి సబ్జా గింజలు మంచి ఆహారమని చెప్పుకోవచ్చు. ఇందులో క్యాలరీలు



తక్కువగా ఉంటాయి. ప్రొటీన్‌తో పాటు ఫైబర్ ఉంటుంది. గ్లూటెన్ ఉండదు. యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ గింజల్లో ఫైబర్ మోతాదు ఎక్కువగా ఉండడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. సాధారణంగా సబ్జా గింజల్ని నీటిలో నానబెట్టుకుని తినచ్చు. లేకపోతే సలాడ్లు, స్మూతీలతో కలుపుకొని తీసుకున్నా అందులోని పోషకాలు శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు.

## వీటిలోనూ..!

సాధారణంగా కూరగాయలు, పండ్లలో ప్రొటీన్ల శాతం తక్కువగా ఉంటుంది. అయితే బచ్చలి కూర, తోటకూర, బ్రకలి.. మొదలైన వాటిలో మాత్రం ప్రొటీన్లు పుష్కలంగా లభ్యమవుతాయంటున్నారు నిపుణులు.



# సినిమా

# టీజర్ రికార్డు




సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సెన్సేషనల్ ప్రాజెక్ట్ 'వారణాసి'. ఇప్పటికే భారీ హైప్ ని క్రియేట్ చేసుకున్న ఈ సినిమాని గ్లోబల్ లెవెల్ లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఇందులో భాగంగా మూవీ నుంచి ఇటీవలే వచ్చిన కంటెంట్ వైడ్ రీచ్ ని సొంతం చేసుకుంది. ఇక ఇదే గ్లింప్స్ ఇప్పుడు యునిక్ ఫీట్ సెట్ చేసింది. తాజాగా వారణాసి మూవీ టీజర్ అరుదైన రికార్డు సృష్టించింది. పారిస్‌లోని ప్రఖ్యాత 'లే గ్రాండ్ రెక్స్' థియేటర్లో ప్రదర్శించిన తొలి ఇండియన్ టీజర్ గా నిలిచింది. యూరప్ లార్జెస్ట్ థియేటర్ ఇదే. స్క్రీనింగ్ కు అవకాశమిచ్చినందుకు మూవీ టీమ్ థాంక్స్ చెప్పింది. 'వారణాసి నుంచి పారిస్ వరకు సాహసయాత్ర మొదలైంది. 2027లో పూర్తి సినిమాతో కలుద్దాం' అని ట్విట్టర్‌లో పోస్టు చేసింది. ఇక అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో టైమ్ ట్రావెల్, పురాణ గాథల (రామాయణం) స్పర్శ కూడా ఉంటుందని సమాచారం. మహేశ్ బాబు సరసన బాలీవుడ్ స్టార్ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. దాదాపు రూ. 800 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు.

# యువతకు దీపిక ఆఫర్



సినిమా రంగంలో రాణించాలనుకునే కొత్త తరానికి బాలీవుడ్ నటీమణి దీపికా పదుకొణె బంపర్ ఆఫర్ ఇచ్చింది. తన 40వ పుట్టినరోజు సందర్భంగా 'ది ఆన్‌సెట్ ప్రోగ్రామ్' అనే కొత్త ప్లాట్‌ఫామ్‌ను మొదలుపెట్టింది. చదువు అయిపోయి ఖాళీగా ఉన్న వారు లేదా సినీ రంగంలో టాలెంట్ చూపించాలనుకునే యువతకు ఇదో గోల్డెన్ చాన్స్. మనలో చాలామందికి కథలు రాయడం, కెమెరా తిప్పడం, డైరెక్షన్ చేయడం, మేకప్, కాస్ట్యూమ్స్ వంటి విభాగాల్లో మంచి పట్టు ఉంటుంది. కానీ ఇండస్ట్రీలోకి ఎలా వెళ్లాలో తెలియదు. అలాంటి వారికోసం దీపికా ఈ వేదికను క్రియేట్ చేసింది. అదేమిటనేది ఆమె మాటల్లోనే.. 'దేశవ్యాప్తంగా ఉన్న యంగ్ టాలెంట్‌ను గుర్తించి, వారికి సరైన ట్రైనింగ్ ఇవ్వాలని గతేడాదే అనుకున్నాను.. ఇప్పుడు దాన్ని నిజం చేస్తున్నాను' అంటూ ఓ వీడియో పోస్ట్ చేసింది. ఈ ప్రోగ్రామ్‌లో జాయిన్ అవ్వాలనుకుంటే.. వెంటనే 'onsetprogram.in' వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ వివరాలు, మీరు చేసే పనికి సంబంధించిన శాంపిల్స్‌ను అక్కడ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నచ్చితే, ఇండస్ట్రీలోని పెద్ద పెద్ద టెక్నీషియన్‌తో కలిసి పని చేసే అవకాశం దక్కుతుంది. నటన ఒక్కటే కాదు.. రైటింగ్, ప్రొడక్షన్, కెమెరా ఇలా అన్ని విభాగాల్లో శిక్షణ కూడా ఇస్తారు.

# రాశికి అనసూయ సారీ



మూడేళ్ల క్రితం జరిగిన ఓ వివాదాస్పద స్కిట్ మళ్లీ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నటి అనసూయ భరద్వాజ్ .. రాశికి బహిరంగ క్షమాపణ చెప్పారు. అప్పటి షోలో రాశి పేరుతో డబుల్ మీనింగ్ డైలాగ్ ఉపయోగించడం తప్పేనని అంగీకరిస్తూ, ఎక్స్ వేదికగా క్షమాపణలు తెలిపారు. ఆ రోజు స్కిట్ రచయితలు, దర్శకులను ప్రశ్నించాల్సిందని, కానీ అప్పట్లో ఆ ధైర్యం తనకు లేదని చెప్పారు. కాలక్రమంలో తన ఆలోచనల్లో మార్పు వచ్చిందని, డబుల్ ఎంటెండ్రస్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన తర్వాత ఆ షోనే వదిలేశానని అనసూయ పేర్కొన్నారు. రాశి ఎదుర్కొన్న అవమానం తనకు పూర్తిగా అర్థమవుతోందని, ఈ విషయంలో బాధ్యత తనదేనని చెప్పి మరోసారి క్షమాపణలు కోరారు. దండోరా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో నటుడు శివాజీ వ్యాఖ్యలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో ఈ విషయం మళ్లీ తెరపైకి రాగా, రాశి గతంలో హైపర్ ఆది స్కిట్ తనను తీవ్రంగా బాధించిందని వెల్లడించారు. బాడీ షేమింగ్, అవమానకర హాస్యాన్ని ఖండించిన రాశి, ఒక దశలో లీగల్ యాక్షన్ ఆలోచన కూడా వచ్చిందని, కుటుంబ సలహాతో ఆ నిర్ణయాన్ని వదిలేశానన్నారు. ఈ తరుణంలో అనసూయ సారీ చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'వారణాసి' గ్లింప్స్.. అక్కడ ఫస్ట్ ఇండియన్ సినిమాగా రికార్డు

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం తాజాగా సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకుంది. జనవరి 5న ఈ సినిమా టైటిల్ టీజర్‌ను పారిస్‌లోని లే గ్రాండ్ రెక్స్ థియేటర్‌లో ప్రదర్శించారు. ఇంటర్నేషనల్ ఆడియన్స్ నుంచి ఆ వీడియోకు మంచి స్పందన వచ్చింది. ఈ విషయం తెలుపుతూ లే గ్రాండ్ రెక్స్ తన అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. దీంతో అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఇది ఇండియన్ సినిమాకు గొప్ప గుర్తింపు అని అభిమానులు భావిస్తున్నారు. గతంలో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాలను ఈ థియేటర్‌లో ప్రదర్శించారు. అయితే విడుదలకు ముందే భారీ స్థాయిలో గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం యాక్షన్ అడ్వెంచర్ మూవీగా 'వారణాసి' సిద్ధమవుతోంది. ఇందులో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో నటిస్తోన్న విషయం తెలిసిందే. ఈ పవర్‌ఫుల్



పాత్ర కోసం ఆయన ప్రాచీన భారత యుద్ధ కళ కలరిపయట్టు నేర్చుకున్నారు. ఇందులో కొన్ని సన్నివేశాల్లో ఆయన రాముడిగానూ కనిపించనున్నారు. మందాకిని పాత్రలో ప్రియాంక చోప్రా, కుంభ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు.

**విడుదల తేదీ వైరల్..**

ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారు.



## అందుకే 'ఉస్తాద్ భగత్‌సింగ్' వదులుకోవాల్సి వచ్చింది

**: సాక్షి వైద్య**

పవన్ కల్యాణ్ హీరోగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ సినిమాలో సాక్షి వైద్య నటించనున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. షూటింగ్‌లో కూడా జాయిన్ అయినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా వీటిపై సాక్షి ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. తనకు ఆఫర్ వచ్చినా కానీ, చేయలేకపోయినట్లు తెలిపారు. ''ఉస్తాద్ భగత్‌సింగ్'లో కీలకపాత్రలో నాకు అవకాశం వచ్చింది. కానీ, ఆ సమయంలో నా కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా నేను వేరే ఊరు వెళ్లాల్సి వచ్చింది. అదే సమయంలో మూవీ టీమ్ సభ్యులు ఫోన్ చేసి రేపటి నుంచి షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వెళ్లలేని పరిస్థితుల్లో తేదీలు సర్దుబాటుచేయలేక దాన్ని వదులుకున్నాను'' అని సాక్షి తెలిపారు. ''గతంలో నేను నటించిన కొన్ని సినిమాలు వరుసగా ఫ్లాప్ కావడంతో నన్ను ఆ సినిమాను నుంచి తీసేశారు అని వార్తలు వచ్చాయి. ప్రేక్షకుల దృష్టికోణంలో అది నిజమేనేమో.. కానీ.. నేను అలాంటివి పట్టించుకోను. నా పని నేను చేసుకుంటూ ముందుకుసాగుతాను. అలాంటివి నన్ను ప్రభావితం చేయలేవు'' అని ఆమె చెప్పారు. ప్రస్తుతం సాక్షి.. 'నారీ నారీ నడుమ మురారి' అంటూ శర్వానంద్‌తో కలిసి ఈ సంక్రాంతికి నవ్వులు పంచడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమా జనవరి 14న విడుదల కానుంది. రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన సంయుక్త కూడా కనిపించనున్నారు.

## 'టాక్సిక్'లో మరో హీరోయిన్.. ఫస్ట్‌లుక్ రిలీజ్




యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్‌దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో రుక్మిణి వసంత్ ఉన్నట్లు టీమ్ ప్రకటించింది. ఇందులో ఆమె మెలిసా అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. మోడ్రన్ డ్రెస్‌లో పబ్‌లో నడుస్తూ రుక్మిణి కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌ల లుక్‌ను విడుదల చేశారు. ఇప్పుడు రుక్మిణి కూడా అందులో ఉన్నట్లు అధికారికమైంది. దీంతో ఇందులో నలుగురు హీరోయిన్స్ అయ్యారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్‌గా, నయనతార గంగ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. భారీ అంచనాల మధ్య వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది.

## అందరూ మెచ్చేలా ది రాజాసాబ్



''ప్రభాస్ 'బాహుబలి'కి ముందు ఎలా కనిపించేవారో 'ది రాజాసాబ్' చిత్రంలో అలా కనిపిస్తార''న్నారు నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్. ఈ సినిమాలోని కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఫాంటసీ అంశాలు అందర్నీ అలరిస్తాయని తెలిపారు. ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. ఈ సినిమా ఈ నెల 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని ''నాచే నాచే..'' గీతాన్ని సోమవారం ముంబయిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ''ఈ చిత్రం రొమాంటిక్ హారర్ ఫాంటసీ జానర్‌లో రూపొందింది. ఇది భారతీయ సినిమాకి కొత్త జానర్'' అన్నారు. సీనియర్ నటి జరీనా వహాబ్ మాట్లాడుతూ.. ''హిందీలో కుటుంబ కథలు పూర్తిగా కనుమరుగైపోయాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.